


# విలువలు

విద్యార్థి

స్వర్ణకు పురుడు పోసాడు పన్నెండేళ్ల కోఫీ. ఆ పురిటినీళ్ల పళ్లాన్ని పట్టకారుతో జాగ్రత్తగా పట్టుకుని కొంచెం ప్రక్కగా గుమ్మరించాడు. అక్కడ ఉన్న చీమల బారులు ఒక్కసారిగా, కుప్పలు, కుప్పలుగా చలనం లేకుండా పడిపోయాయి. అటుగా తిరుగుతున్న తొండ ఒకటి పడిపోయిన చీమల కోసం నాలుక చాచి అందుకుంది. వెంటనే కుప్పకూలింది. ఆ తొండను ఇంకొక పక్షి తినటానికి అందుకోబోయింది. ముక్కుతో తాకగానే మరణించింది.

అప్పుడే వెలుతురు చూసిన స్వర్ణ ఇదంతా చూస్తూనే వుంది. గర్వ పడింది. తన పురిటి నీళ్లకే ఇంత మహిమ వుంటే, తనకి ఇంకెంత విలువ ఉంటుందీ? మురిసిపోయింది.





కోకోవా కాయలు

కోఫీ పురిటి నీళ్ల పళ్లెంలో స్వర్ణను ఉంచి ప్రక్కనే ఉన్న సెలయేటి నీళ్లల్లో ఉంచాడు. మిల మిలలాడుతూ ఆడుకుంటున్న చేప పిల్లలు చలనంలేకుండా సెలయేటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. స్వర్ణ తళ తళా మెరిసింది. స్వర్ణను ఒక తగరంలో చుట్టి జాగ్రత్తగా తన నిక్కరుకున్న లోపలి జేబులో పెట్టుకున్నాడు కోఫీ.

కోఫీ అనాథ. గలామసీ పనులు చేస్తూవుంటాడు. బ్రిటిష్ వారిని ఎదిరించి, ఓడిపోకుండా గర్వంగా నిలబడ్డ అషాంతి తెగకు చెందినవాడు. ఈ అషాంతి రాజ్యం నేటి ఘానా దేశంలో కలసిపోయింది. ఆ దేశానికి యురోపియన్లు ఇచ్చిన పేరు స్వర్ణ తీరం, గోల్డ్ కోస్ట్. ఇక్కడ బంగారం బాగా దొరుకుతుంది.

కోఫీ గొప్ప రైతు కుటుంబంలోనే పుట్టాడు. అతని తాతగారికి పది ఎకరాల కోకోవా తోట ఉండేది. కొకోవా గింజలు లేకపోతే చాక్లెట్టు అనే పదార్థమే లేదు. అందులోనూ ఘానా కోకోవా గింజల నాణ్యత, రుచే వేరు. నాలుగేళ్ల క్రితం కోఫీ తాతగారితో కలసి కోకోవాతోటకి వెళ్లి అక్కడ ప్రక్కనే ఉన్న సెలయేటిలో ఆడుకునే వాడు. అప్పుడప్పుడూ తన చిట్టి చెల్లెలితో కలసి, తుండుతో నీటిలో మిల మిలాడే చేపలను పట్టుకోవటానికి ప్రయత్నిస్తూ ఆడుకునేవాడు. చుట్టూ పచ్చని అడవి. ఎన్నో అందమైన పక్షులు. ఎన్నో వింత జంతువులు. సారవంతమైన నేల, ఏ గింజా నాటాల్సిన అవసరంలేదు, వాటంతటికి అవే పడతాయి, అవే మొలుస్తాయి, అవే పెరుగుతాయి. కానీ అక్కడక్కడా బంగారం కోసం తవ్విన కందకాలు కనిపించేవి. "మన శ్రమకూ, చెమటకూ మించిన బంగారం లేనే లేదు" అనేవాడు కోఫీ తాతగారు.

అటువంటిది ఎగువన ఉన్న ఆంగ్లో అషాంతి గోల్డ్ మైన్స్ లోని దుర్ఘటనతో ఒక్కసారిగా జీవితం తిరగబడింది. అక్కడినుండి కొట్టుకువచ్చిన వ్యర్థాలతో కొకోవా తోట పూర్తిగా నాశనమయ్యింది. గోల్డ్ మైన్స్ వాళ్లతో జరిగిన పోరాటంలో తన తండ్రి మరణించాడు. తాతగారు నిదానస్తుడు, కోఫీని చదివించుకోవాటనికైనా కొంత డబ్బు అవసరమని, తప్పక, అదే ఆంగ్లో అషాంతి గోల్డ్ మైన్స్‌లో కూలీగా చేరాడు. సంవత్సరం క్రితం మైన్స్‌లో జరిగిన దుర్ఘటనలో మరణించాడు.

కోఫీ అధైర్యస్తుడేమీ కాదు, పౌరుషం కలిగిన అషాంతి తెగకు చెందినవాడు. తనలాంటి పిల్లలు ఇప్పుడు చాలా మంది గలామసీలుగా చేస్తున్నారు. గలామసీ అంటే ఎక్కడపడితే అక్కడ, ఏదో విధంగా బంగారం ఉందన్న చోట గోతులు తవ్వి, ఆ మట్టిలోనుంచి వీలయినంత బంగారు తీయటం. నాశనమైపోయిన తన తాతగారి తోటలోనే బంగారం వెతకటం మొదలుపెట్టాడు కోఫీ. ఇదివరకు ఎంతో అందంగా ఉన్న ప్రాంతం ఇప్పుడు వందల మంది గలామసీలు చేసిన గోతులతో, గాయాలతో అసహ్యంగా తయారయ్యింది.

కోఫీ తెలివైనవాడు. అసలు తన తాతగారి కొకోవా తోట ఉన్నట్టుండీ ఎందుకు నాశనమయ్యిందో తెలుసుకున్నాడు. ఆంగ్లో అషాంతి గోల్డ్ మైన్స్ వారు భూగర్భంలోనుంచి మట్టిని తీసి, దాన్ని పొడి చేసి, పెద్ద పెద్ద గుట్టలు చేసి, దాని మీద సైనైడ్ నీళ్లు జల్లుతారు. సైనైడులో బంగారం కరుగుతుంది. ఆ బంగారంతో కలసిన సైనైడ్ ద్రావకాన్ని టాంకులలో నింపి అందులో తుత్తునాగం (Zinc) పలకలు పెడతారు. ఇప్పుడు సైనైడ్ తుత్తునాగాన్ని మింగి, బంగారాన్ని కక్కుతుంది. ఈ సైనైడ్‌తో కలసిన బంగారపు నీళ్ల టాంకులు జాగ్రత్తగా నిర్మించక పోవటంతో అవి కూలి దిగువున ఉన్న కోకోవా తోటలన్నీ నశించిపోయాయి. ఇది తెలుసుకున్న కోఫీ, అదే విధంగా తను కూడా బంగారం ఎందుకు తీయకూడదు అని ఆలోచించాడు. సైనైడ్ సీసా ఒకటి, తుత్తునాగం పలక ఒకటి దొంగిలించాడు. మిగిలిన గలమెసీలు పాదరసం వాడతారు, తనకి తెలివి ఎక్కువ కదా, కోఫీ కొత్త రకంగా ఆలోచించాడన్న మాట.

ఇప్పుడు ఆ సైనైడ్ నీళ్లతోనే స్వర్ణకు పురుడు పోసాడు. స్వర్ణ బొద్దుగా మిల మిలా మెరిసిపోతోంది. తృప్తిగా చూసుకున్నాడు. పది ఎకరాల కోకోవా తోట కొనేటంత విలువ ఒక్కసారిగా దొరికింది.. తన చిట్టి చెల్లెలుకు తను తప్ప ఎవ్వరూ లేరు. ముందు చెల్లెలికి ఒక గౌను కొనాలి, ఒంటి మీద చొక్కా లేకుండా లేకుండా ఎంత కాలమని తిరుగుతుంది!? ఆ కొత్త గౌను వేసుకుని అడుక్కోకుండా, దర్జాగా రోడ్డు ప్రక్కనే అమ్మే కబాబులు, కెలెవెలేలు కడుపునిండా తినిపించాలి. ఆ తరువాత పఫ్ పఫ్ మిఠాయిలు ఇద్దరూ కూర్చుని తినాలి.

కానీ తన దగ్గర స్వర్ణ ఉందని ఎవరికీ తెలవకూడాదు. స్వర్ణని ఒక తగరంలో చుట్టి తన నిక్కరు లోపల ఎక్కడో జాగ్రత్త చేసాడు. ఇప్పుడు స్వర్ణని అమ్మాలి.

కోఫీ నడకలోనే కొత్త ఉత్సాహం కనబడింది. ఇప్పుడు ఘనాలో బంగారం వ్యాపారం చేసేవాళ్లు, పెట్టుబడులు పెట్టేవారూ, ఎక్కడ బడితే అక్కడ కందకాలు తవ్వి బంగారం తియ్యటంలో ఆరితేరిన వాళ్లు చైనీసు పెట్టుబడీదార్లు.. వాళ్లు ఉండే ప్రాంతం వైపు వడి వడిగా అడుగులు వెయ్యటం మొదలుపెట్టాడు కోఫీ. ఉన్నట్టుండి ఎవరో ఒక అపరిచితుడు నవ్వుతూ దగ్గరక వచ్చాడు. కోఫీ వాలకం చూసి "బంగారం అమ్మటానికి వచ్చావా, నాతో రా, మంచి రేటు ఇప్పిస్తాను" అన్నాడు. కోఫీ ఇబ్బందిగా కళ్లు ప్రక్కకి తిప్పి ఒక్క ఉదుటున పరుగందుకోపోయాడు. అపరిచితుడుతో పాటు కోఫీ వెనుకగా వచ్చిన ఇంకొక వ్యక్తి కోఫీ మెడ మీద గట్టిగా ఒక దెబ్బ వేసాడు. పడిపోతున్న కోఫీని ముందు ఉన్న వాడు పొట్టలో గట్టిగా తన్నాడు. చలనం లేకుండా రోడ్డు గుంటలో పడిన కోఫీనీ ఆ ఇద్దరు వ్యక్తులూ వెతికి స్వర్ణను బయటకి తీసారు. స్వర్ణ ఆశ్చర్యపోయింది, తనని ఇంత ఇష్టపడతరా!!! తనకి ఇంత విలువ ఉందన్నమాట!!!.

ఆ ఇద్దరు వ్యక్తులు ఒక చైనీసు వ్యక్తి దగ్గరకు వెళ్లారు. అతను స్వర్ణను పరిశీలించాడు. "సరే, వెయ్యి చీడీ లు (ఘానా కరెన్సీ ఛీడీ) 20 గ్రాముల మాదక ద్రవ్యాలు ఇస్తాను, తీసుకోండీ" అన్నాడు. కనీసం 50 గ్రాముల మాదక ద్రవ్యాలు కావలన్నారు వారిద్దరూ. ఆ చైనీసు వ్యక్తి, ఒక చిరు నవ్వు విదిల్చి, సరే నన్నాడు. స్వర్ణ పుట్టి మూడు గంటలైనా కాలేదు, తన విలువ ఇంతగా పెరుగుతోంది అని గర్వించింది.

ఆ చైనీసు వ్యక్తి దగ్గర ఇంకా చాలా బంగారం ఉంది. ముందు వేసుకున్న ప్రణాళిక ప్రకారం స్విట్జర్లాండు బయలుదేరాడు. ఘానా రాజధాని అక్రా ఎయిర్‌పోర్టులోతనిఖీ ఎక్కువగా ఉంటుంది, లంచం అడుగుతారు. ఎందుకొచ్చిందీ, ప్రక్కనే ఉన్న ఐవరీ కోస్ట్ నుంచి వెళితే తేలిక. ప్రణాలిక వేసుకున్నాడు. ఐవరీ కోస్ట్ అంటే ఏనుగుల దంతాల తీరం. స్వర్ణ తీరానికి ప్రక్కనే ఉంటుంది. ప్రపంచానికి ఏనుగు దంతాల మీద ఉన్న వ్యామోహంతో

అక్కడి ఏనుగులను అంతరింపచేసారు. స్వర్ణను భద్రంగా పెట్టుకుని రోడ్డు మార్గాన ఆ చైనీయుడు ఐవరీ కోస్టులోని అబిడ్జాన్ చేరుకున్నాడు. అక్కడి నుండి స్విట్జర్లాండులోని జ్యూరిక్ నగరం చేరుకున్నాడు. స్విట్జర్లాండులోని కస్టమ్స్ వారితో ఏమాత్రం ఇబ్బంది లేదు. నవ్వుతూ పలకరించారు. మీరు ఏమి తెస్తున్నారు మాకనవసరం, మీకు ఏమన్నా సౌకర్యాలు కావాలంటే ఏర్పాటు చేస్తామన్నారు.

ఎంత శుభ్రంగా ఉందో జ్యూరిక్ నగరం అంత అందంగానూ ఉంది. మనుషలందరూ దొరబాబులల్లే ఉన్నారు. ఆడవాళ్లందరూ లేత గులాబిల్లాగా ఉన్నారు. అందరూ ఎంతో మర్యాదస్తులు. ఎక్కడకి వెళ్లినా నవ్వుతూ పలకరింతలు. యూనియన్ బాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్ అంటే UBS బాంకు అన్ని దేశాలలోనూ ఉంది. ఈ బాంకుకి బిలియన్ల డాలర్ల సొమ్మును ఇనకం టాక్సు కట్టకుండా అన్ని దేశాల వాళ్లకి సహాయం చేసిన ఘన చరిత్ర వుంది. హాంకాంగుకు సొమ్ము బదలీ చేయించ వచ్చు. బాంకు లోపలికి వెళ్లగానే సూటు బూటుతో నిగనిగలాడుతున్న పెద్ద మనిషి ఒకడు వచ్చి ఆ చైనీయుడిను లోపల ఉన్న ఒక చిన్న గదిలోకి తీసుకు వెళ్లాడు. "మిమ్మల్ని చూసి చాలా కాలమయ్యింది" అని పలకరించాడు. ఆ చైనీయుడు తన దగ్గర ఉన్న బంగారం గురించి చెప్పబోయాడు. ఆ స్విస్ పెద్ద మనిషి చేతితో వారించి "మీరు ఎక్కువ వివరించవలసిన అవసరం లేదు, మీలాంటి వారి కోసం మేము ఏర్పాటులతో ఎప్పుడూ సిద్దంగానే ఉంటాము" అని ఇంకొక లేత గులాబి బుగ్గల వనితను పిలిచాడు. "ఈమె, మా అనుబంధ సంస్థ స్విస్ డాటా సేఫ్ ప్రతినిధి" అని పరిచయం చేసాడు.




"హల్లో" అంటూ పరిచయం చేసుకుంది ఆ అందాల రాశి. "ఇక్కడి ఆల్ప్స కొండలలోని గుహలలో మీ బంగారం జాగ్రత్త చేస్తాము. బంగారం ఒక్కటే కాదు, మీరు విలువైన పెయింటింగ్స్, పురాతన శిల్పాలు, లేక విలువైన ఏ వస్తువులు తెచ్చినా మేం జాగ్రత్త చేస్తాము. మీరు ఎలా సంపాదించారనే విషయం గురించి ఒక్క ప్రశ్న కూడా అడగం. ఉదాహరణకు హిట్లర్ నాజీలు, లక్షల మంది యూదులను చంపి వారి బంగారాన్ని, వారి ప్రాచీన కళాఖండాలను మాకు రైళ్లల్లో పంపించారు. మేము ఒక్క ప్రశ్న అడగకుండ దాచాము. అది మా నిజాయితీ, నిబద్దత. కాబట్టి, మీ బంగారం మా దగ్గర చాలా భద్రంగా ఉంటుంది. ఘానాలో ప్రభుత్వ లెక్కల ప్రకారం ఉత్పత్తి అయ్యే బంగారం కంటే నాలుగు రెట్లు మాకు చేరుతుంది, ఎవరకీ కనబడకుండా జాగ్రత్తగా దాస్తాము" అన్నది.

చైనీయుడు ఇబ్బందిగా నవ్వాడు. "ఓ, మీకు ఇంకా కొన్ని విషయాలు వివరించాలి. మీరు ఘానా నుంచి తెచ్చిన బంగారం 90% శాతం నాణ్యత ఉంటుంది. మేము 99.99% నాణ్యత వచ్చేలాగా శుభ్రపరచి ఇస్తాము. మీకు డబ్బు అవసరమైతే, ఎక్కడికైనా ఇదిగో, ఈ బాంకు ద్వారా పంపిస్తాము. కాకపోతే, మీరు ఏదో ఒక సంస్థ మీద ఒక బిల్లు సృష్టించి మాకు పంపండి. ప్రపంచంలోని బంగారం అంతా భారత దేశం చేరుతుంది. అక్కడకి పంపిణీ పద్దతులు మాకు పరిచయమే, ఆ విషయాలు మేము చూసుకుంటాము. మీ డబ్బు మీకు కావాల్సిన చోటుకు పంపిస్తాము" అన్నది.

చైనీయిడు సంతోషించాడు. ఆ లేత గులాబీ బుగ్గల వనితకి స్వర్ణని సంతోషంగా అందించాడు. "ఈ సారి మీరు వచ్చేటప్పుడు ఘానాలోని ఆషాంతి వారి పురాతన శిల్పాలు, బొమ్మలూ, అలాగే ఆ ప్రక్క దేశమైన మాలీ వారి పురాతన వస్తువులూ ఏమన్నా ఉంటే అవి కూడా తీసుకురండి, ఆ అభిరుచి ఉన్నవాళ్లు ఇప్పుడు చాలా మంది ఉన్నారు" అని చెప్పింది.



వేలానికి పెట్టిన 6వ శతాబ్దపు విష్ణువు తల

John Eskenazi Art Dealers, London

స్వర్ణ స్వచ్ఛంగా తయారయ్యింది. తనకు ఎంత విలువ లేకపోతే ఇంత జాగ్రత్తగా చూసుకుంటారూ, అని మురిసిపోయింది. ఇక ముందు రోజులలో తన విలువ ఇంకా ఎంత పెరుగుతుందో అని ఊహించుకుని, కొంత దర్పం కూడా ప్రకటించింది. పైగా తన మీద స్విస్ ముద్ర కూడా పడింది.

లేత గులాబీ బుగ్గల వనిత ఒక రోజున స్వర్ణను దుబాయ్ తీసుకు వెళ్లింది. ఎయిర్‌పోర్టులోనే ముందు ఏర్పాటు చేసుకున్న చోట ఒక భారతీయ యువకుడు కనిపించాడు. అతను తనకు ఉన్న హాండ్ బాగ్‌ను కొంచెంగా జిప్ తీసి అందులో పైన కప్పిన తన బట్టలను జరిపి, ఒక దేముడి విగ్రహం తలను చూపించాడు. మూడు రోజుల క్రితమే పురాతన దేవాలయంలోనుంచి తలని మొండెం మీదనుండి పగలుకొట్టి తీసుకు వచ్చానని చెప్పాడు. అందరూ ఆ దేవాలయం వెయ్యి సంవత్సరాల క్రితము కట్టింది అని చెపుతారు కాబట్టి ఈ దేముడి తల కూడా వెయ్యి సంవత్సరాల నాటిది అని వివరించాడు.

ఆ లేత గులాబీ బుగ్గల వనిత సంతోషించింది, "నువ్వు, ఏజెంటుగా బాగా పని చేస్తున్నావు. ఈ సారి మొండెం కూడా తీసుకువచ్చే ఏర్పాట్లు చూడు, ముక్కలుగా చేసి అయినా తీసుకురా. ఆ దేముడి ముక్కలను అతికించే పనిని మేం చూసుకుంటాం" అని చెప్పి స్వర్ణను అతనికి అందించి ఆ బాగును తను బరువుగా మోసుకుంటూ వెళ్లిపోయింది.

ఆ భారతీయ యువకుడు ఊహలలో తేలిపోసాగాడు. భారత దేశంలోని విమానాశ్రయాలలో కస్టంస్ వాళ్లు ఏమి తీసుకువస్తున్నారో కన్నేసి ఉంచుతారు. ఏమి తీసుకు వెళుతున్నారో పెద్ద పట్టించుకోరు. భారతీయులకి కూడా కొత్త దేముళ్లు, కొత్త గుడులూ కావాలి, పట్టించుకోని గుళ్లు ఎన్నో ఉన్నాయి. ఇలా పది సార్లు కష్ట పడితే వచ్చిన బంగారంతో పెద్ద వ్యాపారమే చెయ్య వచ్చు, నీరవ్ మోడీ అంత గొప్పవాడిగా అయిపోవచ్చు. కాని ఇప్పుడు చిక్కల్లా స్వర్ణని జాగ్రత్తగా తీసుకు వెళ్లాలి. అతను తెలివి తక్కువ వాడేమీ కాదు. ముందే పథకం వేసుకుని పాత సెల్ ఫోనులు తెచ్చుకున్నాడు. ఒకటి బాగా పాతది. బాత్రూముకి వెళ్లి ఆ పాత సెల్ ఫోనులోని బాటరీ తీసి, స్విస్ ముద్రతో ఉన్న బంగారం బిస్కెట్, స్వర్ణను ఆ బాటరీ పెట్టే చోట పెట్టాడు. కస్టంస్ వాడు అడిగితే తన దగ్గర ఉన్న కొత్త సెల్ ఫోనుకి డబ్బులు కట్టి, రెండోది పాతదని చెప్పవచ్చు.

స్వర్ణ గర్వించింది. తనకోసం ఈ మనుషులు ఎంత కష్టబడుతున్నారు, ఎంత జాగ్రత్త పడుతున్నారు!!!

—————————

సుందరాచారిగారికి సేఠ్ దగ్గర నుండి కబురు వచ్చింది. నలభై ఏళ్ల వయసులో అరవై ఏళ్ల వాడిలాగా మంచాన పడి తెగ దగ్గుతున్నాడు. ఎవరో రాజకీయ నాయకుడు కొడుకుకీ, వ్యాపారవేత్త కూతురుకీ సంబంధం కుదిరిందంట. పెళ్లి కూతురు ఆభరణాల కోసం ఆర్డరు వచ్చిందట. సేఠ్ ఈ సారి ముందుగానే అడ్వాన్సు డబ్బులు పంపాడు. తన పనితనం ఉన్న స్వర్ణకారుడు ఇంకొకడు లేడు, తనతోనే చేయించాలిని అని ఆర్డరు ఇచ్చిన వాళ్లు చెప్పారట. ఆరోగ్యం ఇప్పటికే చెడిపోయింది, ఇంక పని లోకి రానని చెప్పబోయాడు. ఇంతలో కాలేజీ ఫీజుకి డబ్బులడిగిన కొడుకు గుర్తుకొచ్చాడు. ఇంటిలో అన్నీ నిండుకున్నాయి అని నసుగుతూ, అప్పుడప్పుడూ దెప్పి పొడుస్తున్న భార్య ఎదురుగా తచ్చాడుతూ కనబడింది. తప్పలేదు, డబ్బు పుచ్చుకుని భార్య కిచ్చి, ఉబ్బసం దగ్గుతో బయలుదేరాడు.

సుందరాచారిగారికి వయసు నలభై అయినా, ముప్పై ఐదు సంవత్సరాల వృత్తి అనుభవం ఉంది. తనకి ఊహ తెలిసినప్పటి నుంచి కుల వృత్తిలోనే ఉన్నాడు. చిన్నతనంలో బంగారం కరిగించి పోతపోసేటప్పుడు కాలిన గాయాలు. ఆ తరువాత ఎప్పుడో నైట్రిక్ ఆసిడ్ పడి చేతులు కాలిన గాయాలు. ఇప్పుడు సిలికోసిస్ అంటూ ఉబ్బసంతో కూడిన దగ్గు. సోల్డరింగ్ గన్నుతో నగిషీలు చెక్కి అమర్చేటప్పుడు కళ్లకు తగిలే వేడితో అప్పుడే వచ్చిన కాటరాక్టు.. ఒక కన్నుకి ఆపరేషన్ చేయించుకోవాలి. నీరసంగా ఉందంటే డాక్టరు లెడ్ పాయిజినింగన్నాడు. అయినా సరే కుల వృత్తి, వెళ్లాలి తప్పదు. తన కొడుకుని కులవృత్తిని తప్పించి చదివించాలని నిర్ణయించింది తనే కదా, మరి తప్పదు ఫీజు కట్టటానికి తను శ్రమపడాల్సిందే, జీవితానికి ఉన్న బాధ్యతలను నెరవేర్చాలి మరి.

సుందరాచారిగారు వెళ్లి స్వర్ణను పట్టుకున్నారు. ప్రక్కనే ఉన్న రాగిణిని కూడా పట్టుకున్నారు. స్వర్ణకు కొంత ఏవగింత కలిగింది. ఇప్పుడు రాగిణిని తనతో కలుపుతారా ఏమిటి? తక్కువ జాతిది. రాగిణి కూడా గమనించింది, "మీ అంత కాకపోయినా, మేము పుట్టటానికి కూడా బోలెడు అకృత్యాలు జరిగాయి. అయినా మా లాంటి తక్కువ జాతి వాళ్లు లేక పోతే, మీలాంటి ఎక్కువ జాతి గల వాళ్లకి నిలబడగలిగే బలం ఉంటుందా?" అని ప్రశ్నించింది. తన విలువ ఎప్పటికీ పెరుగుతూనే ఉంటుంది కానీ ఇలా తక్కువ జాతి వాటితో కలిస్తే ఎలా అని అనుకుంది స్వర్ణ. కానీ, తప్పదు ఎం చేస్తాం, అని సరి పెట్టుకుంది. ఇంతలో సేఠ్ సుందరాచారిగారి దగ్గరకి ఒక పెద్ద రత్నాన్ని, ఇంకొన్ని మణులనూ తీసుకు వచ్చాడు. స్వర్ణ సంబర పడిపోయింది. తన కన్నా ఎన్నో మెరుపులు గలది రత్న, తన కన్నా పెద్ద జాతి. తన కంటే గొప్ప వాళ్లతో స్నేహం. తన విలువ ఇంకా ఎంత పెరుగుతుందో, సంతోషించింది స్వర్ణ.

సుందరాచారిగారు స్వర్ణను ఎంతో అందమైన హారంగా మార్చారు. జాతి రత్నాన్ని పతకంలో అమర్చాడు. చుట్టూ రకరకాల మణులని పొదిగారు. ఆ తరువాత హేమను పట్టుకుని మాచింగ్ గాజులు చేసాడు. కాంచనను పట్టుకుని అరవంకీలు చేసాడు. దీప్తిని పట్టుకుని పాపిటి శీరను చేసాడు. కనకం పాత బంగారం కలిగిన వడ్డాణం. కనకాన్ని తిరిగి పోతపోసి, కొత్త డిజైను వడ్డాణం ఆ మాచింగ్ సెట్టుకు సరిపడా చేశారు.

సేఠ్ వచ్చాడు. సుందరాచారిగారు ఆభరణాలు అన్నిటినీ తన ఎదురుగా ఉన్న టేబిల్ పైన పెట్టారు. సుందరాచారిగారు తన పనితనానికి తనే మెచ్చుకోకుండా ఉండలేకపోయారు. సంతృప్తి. ఇంతలో సుందరాచారిగారి నుదుట మీదనుండి ఒక చెమట బొట్టు స్వర్ణ మీద పడి, రత్న మీదకు చిందింది. సేఠ్‌కి పట్టరాని కోపం వచ్చింది. సేఠ్ గబ గబా ఒక మస్లిన్ గుడ్డ తీసుకుని చూపుడు వేలుకి చుట్టి జాగ్రత్తగా, సుతారంగా తుడిచాడు. సుందరాచారిగారి వంక కొరకొరా చూసి, కొంత డబ్బులు ఇచ్చి, మిగిలన డబ్బులు ఆర్డరు ఇచ్చినవాళ్లు పూర్తిగా డబ్బులు చెల్లించిన తరువాత ఇస్తానని చెప్పి, ఇక వెళ్లమన్నాడు. ఆ మిగిలిన డబ్బు రాదని సుందరాచారిగారికి తెలుసు.

సేఠ్ ఆభరణాలన్నిటినీ తీసుకుని షో కేసులో చక్కగా యువతి బొమ్మకి అమర్చాడు. "అమ్మకానికి కాదు", అని చిన్న అక్షరాలతో ఒక కాగితాన్ని షోకేస్ అద్దానికి క్రిందగా అతికించాడు. ధర అడిగిన వాళ్ల హోదాని గమనించి తన దగ్గరకి పంపమని సేల్స్ వాళ్లందరికీ చెప్పాడు సేఠ్.

ఎల్లుండి బంగారం కొనుక్కోవటానికి మంచి రోజు. ఈవేళే వస్తువులు ఎంచుకుని పక్కన పెట్టిస్తే, ఎల్లుండి డబ్బు కట్టి తీసుకు వెళ్లవచ్చు. తండోపతండాలుగా జనం వస్తున్నారు. ఇరుకు ఇరుకుగా, తొక్కిడి తొక్కిడిగా తయారయ్యింది దుకాణం. సెక్యూరిటీ వాళ్లని చాలా మందిని పెట్టాడు సేఠ్. సెక్యూరిటీ వాళ్ల మీద నమ్మకం లేక, వాళ్ల మీద అజమాయిషీకీ తన కుటుంబంలోని వాళ్లందరినీ నియమించాడు. తన కుటుంబంలోని వాళ్ల మీద కూడా సేఠ్‌కు నమ్మకం లేదు, వాళ్లందరినీ సెక్యూరిటీ కెమేరాలాలో గమనిస్తున్నాడు సేఠ్.

వచ్చిన వాళ్లందరి కళ్లూ స్వర్ణ మీదే. ఆశగా, ఆబగా ఆత్రంగా అందరూ ఆ బంగారపు సెట్టునే చూస్తున్నారు. స్వర్ణకు బోలెడు గర్వం కలిగింది. తన విలువ ఇంతా అనుకుంది. ఇంతలోనే అనుమానం వచ్చింది, తనకి ఇంత విలువ ఎందుకు ఇస్తున్నారు? తనని ఈ మనుషులు తినలేరు. తనని ధరించినా ధరించక పోయినా వీళ్ల జీవతం కొనసాగుతుంది. వేరే జీవకోటికి దేనికీ తన అవసరం లేదు? మరి ఎందుకు తన విలువ అంతగా పెరిగింది? ఏదయితేనేం, తన విలువ పెరిగింది.

ఇంతలో గాజులలో ఉన్న హేమ మాట కలిపింది. నేను పపువా న్యూగినీ నుండి వచ్చా. అక్కడ నాకు పాదరసంతో పురుడు పోసారు. ఆ పాదర రసం వ్యర్థాలతో ఇప్పటికీ ఊళ్లకు ఊళ్లు పాడుపడ్డాయి. అయితేనేం, ఇక్కడ మనకెంత విలువో" అన్నది.



అది వింటూనే అరవంకీలలో ఉన్న కాంచన అన్నది, "అవునా, నేను గయానా నుండి వచ్చాను. అక్కడ మాకు కూడా సైనైడ్‌తోనే పురుడు పోస్తారు. అక్కడ కట్టిన సైనైడ్ టాంకు కూలి, ప్రక్కన ఉన్న నదిలోకి టన్నులకు టన్నుల సైనైడ్ తో కలసిన వ్యర్థాలు నదిలోకి పడింది. ఆ నది మొత్తం చచ్చిపోయింది, ఆ నది ప్రక్కన ఉండే మనుషులందరూ ఊళ్లు వదిలేసి పోయారు".

పాపిటి శీరలోని దీప్తి అందుకుంది, "నేను ఫిలిప్పీన్స్ నుండి వచ్చాను. అక్కడ నాకు పురుడు పొయ్యటం కోసం గుట్టలు గుట్టలుగా పోసిన మట్టి వర్షాలకు కూలి, ఊరు, ఊరే మునిగిపోయింది".

వడ్డాణంలోని పాత బంగారం కనకం అన్నది "నేను పుట్టినప్పుడు కూడా బోలెడు అకృత్యాలు జరిగాయి. ఇంకా కొత్త కొత్త తంతులు కూడా చాలా చూసాను. నన్ను వడ్డాణంగా దాచిపెట్టిన పెద్దావిడ మొన్నటికి మొన్న మంచం పట్టితే, ఆవిడ పిల్లలు ఆవిడ చికిత్స కోసం పెట్టిన శ్రద్ద కంటే, నన్ను ఎలా పంచుకోవాలో అని పేచీలు పెట్టుకున్న తంతు గొప్పది. ఆవిడ ఊపిరి చల్లారక ముందే నాకోసం కొట్టుకుని, మాటలు లేకుండా విడిపోయారు. ఇలాంటి తంతులు మీరు కూడా చూస్తారు"

"భలే, భలే, ఏదైతేనేం, మనకి బోలెడు విలువ" అన్నది స్వర్ణ,





అప్పటి దాకా హారంలోని పతకంలో ఉండి ధగ, ధగా మెరుస్తున్న రత్న, ఇంక ఉగ్గపట్టుకోలేక, హూంకరించింది. "ఏం, ఈ మాత్రానికేనా మీకింత పొగరు? నేను ఆఫ్రికా లోని సియెర్రా లియోనీ నుండి వచ్చాను. మా జాతికే "Blood Diamonds" అంటే రక్తపు రత్నాలు అని పేరు. మా చరిత్ర గురించి సినిమాలే తీసారు. మా కోసం ఫోడే శాంకో అనేవాడు "Revolutionary United Front" అనే విప్లవ సంస్థను స్థాపించి, ఊళ్లకు ఊళ్లను తగలబెట్టి, వేలకు వేలమందిని చంపాడు. తొమ్మిది, పదేళ్ల ఉన్న పిల్లలు వాళ్ల నాయినమ్మల దగ్గర రాత్రి కథలు చెప్పించుకుంటూ నిద్రబుచ్చే వేళ్లల్లో దాడులు చేసి, ఆ పిల్లల ఎదుటనే పెద్దవాళ్ల మీద పెట్రోలు పోసి నిప్పు అంటించి, ఆ పిల్లల ఎదుటనే ఆడవాళ్లను చెరిచి, ఆ పిల్లలనే బాల సైనికులుగా తయారు చేసి, అక్కడి గనుల్లోనుంచి నన్ను తీసారు. ఫోడే శాంకో ఆ బాల సైనికులకి కోటా కూడా పెట్టాడు, ఎంత మంది ముంజేతులు బ్రతికి ఉండగానే మొండి కత్తులతో నరికి ఎవరెక్కువ తీసుకు వస్తే, వాళ్లకి సైన్యంలో ప్రొమోషన్లు. మా రత్నాల కోసం ఎన్ని వేల గోనె సంచులు ముంజేతులతో నింపారో! మా రత్నాలన్నింటినీ ఫోడే శాంకో తన స్నేహితుడు, ప్రక్కనున్న లైబీరియా దేశాధినేత ఛార్లెస్ టైలరుకిస్తే, ఎన్నో ఆయుధాలు ఇచ్చేవాడు. ఎంతమందో గొప్ప గొప్ప వాళ్లు, మతాధిపతులు, వ్యాపారవేత్తలు, సినిమా ప్రముఖులూ, మాధక ద్రవ్యాల వ్యాపారస్తులూ, దేశ దేశాల మంత్రులు, బెల్జియం వజ్రాల వ్యాపారులూ అందరూ మా కోసం ప్రత్యేకంగా విమానాలు వేసుకు వచ్చేవారు. అంతెందుకు, మా పాత తరం రత్నాల కోసం ఎన్నో యుద్ధాలు జరిగి, ఎన్నో కోట్ల మంది సైనికులు మరణించారు, ఎన్నో రాజ్యాలు కూలినాయి. అదీ విలువ అంటే. స్వర్ణా, నీ స్థాయి నాకు ఊతంగా పట్టుకుని నిలబడటమే, కానీ నా స్థాయి ఏమిటో తెలుసా? రాజుల కిరీటాలలో, రాణుల కిరీటాలలో ఉండి వాళ్ల తలపై ఎక్కి కూర్చుంటాను. తెలుసుకో"

స్వర్ణకి రోషం వచ్చింది, "ఏం, మా జాతి వాళ్ల చరిత్ర మీ జాతి వాళ్లకంటే తక్కువ కాదు. మా విలువ ఎప్పటికీ పెరుగుతూనే ఉంటుంది, ఏమనుకున్నావో" అన్నది.

రత్న నవ్వింది. "విలువ మీకు కాదు, నాకు కాదు. మనం జీవ కోటికి పట్టించిన క్షయ, ఈ మనుషుల వ్యామోహానికి అక్షయ. ఈ మనుషులకి వ్యామోహమే లేకపోతే, మనకి విలువ లేదు. ఎన్ని ఎక్కువ అకృత్యాలు ఉంటే, వారి నాయకులకి అంత విలువ. ఆ అకృత్యాల విలువలే మనకి ఆపాదిస్తారు. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ తనని ఎవరూ చూడటంలేదు కాబట్టి దొంగ పనేమి చేయలేదు అని అనుకుంటుంది. అలాగే, ఈ బంగారపు కొట్టులకు ఎగబడే మనుషులందరకీ, మనం తళ తళా కనబడితే కలిగే వ్యామోహం విలువలు. అవే విలువలు, వాళ్లు వాళ్ల దేముళ్లకి కూడా ఆపాదించి వజ్ర కిరీటాలు చేయించి, మనలని ఆ దేముళ్ల తలకెక్కించుతారు. బాబాలకు సింహాసనాలూ చేయించుతారు. తెలుసుకో" అన్నది రత్న.

మనుషులందరూ ఆ బంగారపు కొట్లో తోసుకుంటూ ఆ షోకేసులో ఉన్నవాటిని ఆశగా, ఆబగా, ఆత్రంగా చూస్తూనే వున్నారు. మెరుపులని మెచ్చుకుంటున్నారు కానీ కళ్లు మూసుకుని పాలు తాగే పిల్లిలాగా, వెనుక జరిగిన అకృత్యాలతో తమకు సంబంధం లేదు అనుకుంటున్నారు. ఆ ఆలోచనే వద్దనుకుంటున్నారు. ఇప్పుడు కొనకపోతే రేపు పెరిగిపొతుంది, పెరిగిపోతుంది అని విలువలని ఆపాదించుకుంటున్నారు.

★★★

Click here to share your comments on this story